గృహ సారథులే రథ సారథులు



రొద్దం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

• ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: 'వైఎస్సార్‌సీపీకి గృహ సారథులే రథసారథులు.. పార్టీ పటిష్టతకు సైనికుల్లా పనిచేయాలి.. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అధిక మెజార్టీతో గెలిపించే బాధ్యతను తీసుకోవాలి' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండల గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల లబ్ధి, వైఎస్సార్‌సీపీ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్య పరచాలని తెలిపారు. నియోజకవర్గంలో గత పాలకుల దోపిడీ పూరిత వ్యవహారంతో ప్రజలను వేధించారని, ప్రస్తుతం ప్రశాంతమైన వాతావరణంలో విలువలతో కూడిన పారిపాలన అందిస్తున్నారు. అనంతరం సచివాలయాల సమన్వయకర్తగా నియమితులైన ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

అధికారులతో సమీక్ష..

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై సమీక్షించారు. అర్హులకు పథకాలు అందించడంతో అధికారులు అలసత్వం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ రూప, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ బోయ తిమ్మయ్య, రొద్దం, కలిపి సింగిల్ విండో చైర్మన్లు లక్ష్మీనారాయణ రెడ్డి, కేపీ శ్రీనివాసులు, జిల్లా కమిటీ సభ్యులు కలిపి శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ మారుతీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిగి: ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా అర్హులకు చేరాల్సిన సంక్షేమ పథకాలను వలంటీర్లతో సమన్వయం చేసుకొనే బాధ్యత గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లదేనని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని బీరప్ప ఆలయ కళ్యాణ మండపంలో సోమవారం మండల వ్యాప్తంగా ఉన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఈనెల 11 నుంచి గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు గ్రామాల్లో ప్రతి ఇంటా తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ సందర్భంగా మండల సచివాలయ కన్వీనర్‌గా బసవనపల్లి గంగాధర్‌రెడ్డి నియమితులైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి డీవీ రమణ, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, జెడ్పీటీసీ శ్రీరామప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మారుతీరెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్‌పై సమీక్ష

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ సమస్యలపై ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



అమరాపురం: బసవనపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

• ఎమ్మెల్యే తిప్పేస్వామి

గుడిబండ: జగనన్నను 2024 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొంకల్లు ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో మండలంలోని గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు పనిచేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఇంకా ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అలాంటి వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ భూతరాజు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ జయరామ్, వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగన్న, మండల సచివాలయాల కన్వీనర్ కె.శివకుమార్, సింగల్‌విండో అధ్యక్షుడు చంద్ర, సర్పంచ్‌లు కవిత, యంజారేగౌడు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేద వర్గాలకు అండగా సీఎం జగన్

అమరాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద వర్గాలకు అండగా ఉంటూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తూ తమను ఆర్థికంగా ఆదుకుంటున్నారని మళ్లీ జగనన్నకే మా దీవెనలు ఉంటాయని లబ్ధిదారులు, మహిళలు పేర్కొన్నారు. మండల పరిధిలోని బసవనపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికీ లబ్ధి పొందిన బుక్‌లెట్‌ను కుటుంబ సభ్యులకు అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు. అర్హతే ప్రామాణికంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి కుటుంబానికి నేరుగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వీటిని గుర్తించి మళ్లీ వైఎస్ జగన్‌కు మీ దీవెనలు అందించాలన్నారు. వేసవి సమీపిస్తుండడంతో గ్రామాల్లో ఎక్కడ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సింగిల్ విండో అధ్యక్షుడు చిక్కన్న, కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు రాజేశ్వరి, లక్ష్మీదేవి, ఎంపీటీసీ నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహప్ప, దివాకర్, భాషాసాబ్, రమేష్, శివకుమార్, శివానాయక్, నారాయణ, ప్రసాద్, తిప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు మాటలు తిప్పికొట్టాలి



హిందూపురం: గృహసారథులకు బుక్‌లెట్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

• ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

హిందూపురం: సచివాలయ గృహ సారథులే పార్టీ రథసారథులని ప్రభుత్వ పథకాలు ఇంటింటికీ తెలియజేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనను వివరించే గురుతర బాధ్యత మీపై ఉందని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. స్థానిక ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన 'మా నమ్మకం నువ్వే జగన్ 'కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల సచివాలయ గృహసారథుల శిక్షణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ జైత్రయాత్రను ఎలాగైనా అడ్డుకోవాలని, లేకపోతే జగనన్నను మరో 35ఏళ్లు పాలన సాగిపోతుందని భయంతో టీడీపీ, జనసే పార్టీలు ఎల్లో మీడియాతో కలసి కుట్రలు పన్నుతూ ప్రజల్లో విషబీజాలు నాటేందుకు యత్నిస్తున్నాయన్నారు. వారి కుట్రలను తిప్పికొట్టేలా ప్రతి ఇంటికి వెళ్లి గత టీడీపీ దోపిడీ పాలన, నేడు వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన వ్యత్యాసాన్ని తెలియజేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేసి, సీఎంకు కానుకగా అందిద్దామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామాంజి, రఘునాథరెడ్డి, జెడ్పీటీసీ నాగభూషణం, నాయకులు బసిరెడ్డి, రాము, మూర్తి, శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు, గృహసారథులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్ అన్నారు. గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాల్టీ పరిధిలోని 11వ వార్డు మోడల్‌కాలనీలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వార్డు బీజేపీ కౌన్సిలర్ అంజలీ, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, వార్డు ఇన్‌చార్జి చంద్ తదితరులు కలసి కాలనీలో పర్యటించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటిస్థలాలు, ఇళ్ల మంజూరుతో పాటు డ్రైనేజీ మెరుగుపర్చాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకే వివక్షకు తావు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. తన మన అని భేదం లేకుండా టీడీపీ నాయకుల బిడ్డలకు సైతం విదేశీ విద్యా దీవెన ద్వారా రూ.లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుండటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఔదార్యానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జబీవుల్లా, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

పెనుకొండ రూరల్: పెనుకొండ 44వ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడటంతో ముగ్గురు గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. గుట్టూరు నుంచి పెనుకొండ వైపునకు ఆరుగురితో ఆటో వెళ్తోంది. అయితే దుద్దేబండ మలుపు దగ్గరకు రాగానే వెనుక వస్తున్న వాహనానికి సైడ్ ఇచ్చేందుకు ఆటో డ్రైవర్ వాహనాన్ని సెడన్‌గా తిప్పడంతో వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఆరుగురిలో రంగమ్మ, అంజినమ్మ, గంగాధర్ గాయపడ్డారు. అయితే అంజనమ్మకు బలమైన గాయాలు కావడంతో బెంగళూరుకు తరలించారు.

అదానీ అక్రమ వ్యాపారాలపై విచారణ చేపట్టాలి

హిందూపురం టౌన్: అదానీ అక్రమ వ్యాపారాలపై సీబీఐ, సంయుక్త పార్లమెంటరీ కమిటీ విచారణ జరిపించాలని ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ డిమాండ్ చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ కేటీ శ్రీధర్, జిల్లా అధ్యక్షుడు సుధాకర్, పెనుకొండ ఇన్‌చార్జ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన కంది

గోరంట్ల: మండల పరిధిలోని కోండ్రెడ్డిపల్లికి చెందిన మహిళా రైతు సుబ్బమ్మకు చెందిన 9 ఎకరాల్లో సాగు చేసిన కంది పంట సోమవారం అగ్నికి ఆహుతైంది. ఆకతాయి నిప్పు పెట్టడం పంట మొత్తం కాలిబూడిదైందని, రూ.2 లక్షలకు పైగా నష్టవాటిల్లిందని బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

అమరాపురం: స్థానిక ప్రసన్న లక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారికి తిరువీధి , పార్వేట ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు.

నేడు జీ-20 దేశాల ప్రతినిధుల రాక

మడకశిర: పావగడ నియోజకవర్గంలోని తిరుమణి సోలార్ పార్కును మంగళవారం జీ-20 దేశాల ప్రతినిధులు సందర్శించనున్నారు. వారు రోడ్డు మార్గంలో బెంగళూరు నుంచి బయలుదేరి కొడికొండ, చిలమత్తూరు, లేపాక్షి, మడకశిర మీదుగా పావగడ నియోజకవర్గంలోని తిరుమణి సోలార్‌పార్కుకు చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. తొలుత జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌సింగ్ పాటు ఇతర పోలీస్ ఉన్నతాధికారులు ముందు జాగ్రత్తగా మడకశిర-పావగడ రోడ్డును పరిశీలించారు. ఆ తర్వాత అనంతపురం జిల్లా ఎస్పీ కాగినెల్లి ఫక్కీరప్ప కూడా మడకశిర మండలంలోని కర్నాటక సరిహద్దు ప్రాంతంలో రోడ్డును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు సలహాలిచ్చారు.



కర్ణాటక సరిహద్దులోని రోడ్డును పరిశీలిస్తున్న అనంతపురం జిల్లా ఎస్పీ ఫక్కీరప్ప తదితరులు

ఎంపీటీసీకి ఎమ్మెల్యే పరామర్శ

గుడిబండ: గత కొంత కాలంగా పక్షవాతంతో బాధపడుతున్న సీసీ గిరి ఎంపీటీసీ రామచంద్రప్పను సోమవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి బైరేపల్లికి వెళ్లి పరామర్శించారు. అనంతరం మందలపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు రమేష్‌ను కూడా పరామర్శించారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

సోమందేపల్లి: పంట రుణాలు మార్చి 28 లోపు రెన్యూవల్ చేసుకోవాలని సోమందేపల్లి సింగిల్ విండో చైర్మన్ కొల్లప్ప, సీఈఓ శ్రీనివాసులు ఓ ప్రకటనలో తెలిపారు. 1బి, ఆధార్ కార్డుతో పాటు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు చెప్పారు.

నకిలీ విత్తనాల విక్రయంపై రైతుల నిరసన

పావగడ: నకిలీ ఉల్లిగడ్డ విత్తనాల విక్రయంతో నష్టపోయామంటూ వైఎన్ హొసకోటలోని భాగ్యలక్ష్మి ఏజెన్సీ దుకాణం ఎదుట బాధిత రైతులు నిరసన తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆగ్రో సీడ్స్ కంపెనీ నిర్వాహకులతో మాట్లాడి సమస్య ను పరిష్కరిస్తామని దుకాణం యజమాని రాధాకృష్ణ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

మంత్రి పెద్దిరెడ్డికి స్వాగతం పలికిన నాయకులు

చిలమత్తూరు: రాష్ట్ర భూగర్భ గనులశాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి బాగేపల్లి టోల్‌గేట్ వద్ద నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి , పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో బెంగళూరు విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గాన రాగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, ఎంపీపీ పురుషోత్తమరెడ్డి, లేపాక్షి, చిలమత్తూరు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు నారాయణ స్వామి, ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ జగన్మోహన్ రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ పరీక్షలో ప్రతిభ

మడకశిర(అగళి): అగళికి చెందిన రైతు మహేంద్ర, అనిత దంపతుల కుమార్తె అంజలి ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేషన్ పరీక్షలో అత్యంత ప్రతిభను కనబరిచింది. దేశస్థాయిలో ఈపరీక్షలో 9వ ర్యాంక్ సాధించింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి సోమవారం ఫోన్ ద్వారా అంజలి తండ్రి, అగళి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మహేంద్ర దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అంజలిని కూడా అభినందించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంక్ సాధించినట్లు అంజలి తెలిపారు.



అంజలి (ఫైల్)

భూతరాయస్వామికి జలధి ఉత్సవం

అమరాపురం: మండలంలోని వలస గ్రామంలో వెలసిన భూతరాయస్వామికి సోమవారం భక్తులు జలధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు బాలన్న ఆధ్వర్యంలో స్వామి ఉత్సవ విగ్రహన్ని సమీప వంక వద్దకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి ప్రత్యేకంగా గంగా జలంతో పూజలు చేశారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

మిషన్ అంత్యోదయ సర్వేపై శిక్షణ

గోరంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ రఘునాథ గుప్తా ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీ, మిషన్ అంత్యోదయ సర్వేపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ సతీష్‌కుమార్ , అంగన్‌వాడీ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

హిందూపురం టౌన్: పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను కోరారు. స్థానిక ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీకి వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ స్పందిస్తూ ఉన్నతాధికారులతో మాట్లాడి కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు



ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

లేపాక్షి: లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలో సోమవారం ఉదయం దేవాదాయశాఖ హుండీ పర్యవేక్షణ అధికారి, ఇన్‌స్పెక్టర్ బి.నరసింహరాజులు ఆధ్వర్యంలో హుండీ కానుకలు లెక్కించారు. 114 రోజులకు గాను రూ. 3,13,857 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి పేర్కొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

పెనుకొండ: పట్టణంలోని మడకశిర రోడ్డులో రూ.20 కోట్లతో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను జిల్లా రోడ్లు భవనాలశాఖ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్ సంజీవయ్య సోమవారం పరిశీలించారు. చిన్న లోపాలను సవరించుకుని వెంటనే తారు పనులను పూర్తీ చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

శ్మశాన వాటికలో కంపచెట్ల తొలగింపు

మడకశిర: పట్టణంలోని 3వ వార్డు పరిధిలోని శివాపురం శ్మశాన వాటికలో సోమవారం మున్సిపల్ సిబ్బంది కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించారు.

9న చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి పంచాయతీలోని చింత చెట్లను ఈనెల 9న గురువారం ఉదయం 10.30 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ నర్సేగౌడు, ఈఓఆర్డీ శైలజ సమక్షంలో వేలం వేస్తున్నట్లు గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి తెలిపారు.

ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు అంగీకారం

పెనుకొండ: పట్టణంలోని బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో తాగునీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈఓ ఎంవీ రావుకు సమస్యను వివరించారు. 500 లీటర్ల సామర్థ్యం ఉన్న ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి అంగీకరించడంతో వార్డెన్ గంగాధర్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు సచివాలయ కన్వీనర్ల సమావేశం

మడకశిర: మడకశిరలోని మార్కెట్ యార్డు ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నియోజకవర్గంలోని సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులతో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకులు పోకల అశోక్‌కుమార్ హాజరవుతారని చెప్పారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఛత్రం పంచాయతీ సమీపంలో వెలిసిన ఈరమాళమ్మ అమ్మవారికి సోమవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులను సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శాంతి హోమం



మద్దనకుంటలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంటలో కురుబ కులస్తుల ఆరాధ్య దైవం మైలార లింగేశ్వర స్వామికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచే అర్చకులు భక్తులు శాంతి, గణ, వాస్తు హోమాలను నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నదానం చేశారు. కార్యక్రమానికి మండలం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.

గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలి

హిందూపురం టౌన్: దేశం కోసం, సమాజం కోసం పాటు పడి ఉన్నత శిఖరాలను అధిరోహించిన గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఎంఈఓ గంగప్ప అన్నారు. సోమవారం అబ్దుల్ గఫార్ ఖాన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక అబ్దుల్ గఫార్ ఖాన్ మున్సిపల్ పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగప్ప కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు అబ్దుల్ గఫార్ ఖాన్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

హైదరాబాద్‌కు నూతన బస్సు సర్వీసు

హిందూపురం టౌన్: హిందూపురం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేకంగా ఇంద్ర ఏసీ పుష్ బ్యాక్ సీట్స్‌తో నూతన బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు హిందూపురం నుంచి బయలుదేరి పెనుకొండ, అనంతపురం మీదుగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు హైదరాబాద్ చేరుతుందన్నారు. అలాగే తిరిగి రాత్రి 9 గంటలకు బీహెచ్ఈఎల్ నుంచి బయలుదేరి ఉదయం 7.10 గంటలకు హిందూపురం చేరుతుందన్నారు.

వైభవంగా జాతర మహోత్సవం



అలంకరణలో బాలా చౌడేశ్వరీదేవి

పరిగి: భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఊటుకూరు బాలా చౌడేశ్వరీదేవి అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఉదయాన్నే అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తిని గ్రామంలో ఊరేగించారు. తర్వాత గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలీకేక ప్రాంతంలో అమ్మవారికి గావు కేక నిర్వహించి, పొలిమేరల దాకా పోలీ కేక పెట్టుకుంటూ అమ్మవారి కరుణాకటాక్షాలను ప్రసాదించాలని పోలీని చల్లించారు. ఎమ్మెల్యే శంకరనారాయణ బాలా చౌడేశ్వరీదేవిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు.



నాదాలను నోటిలో గుచ్చించుకునేందుకు సిద్ధంగా ఉన్న మహిళా భక్తులు

ప్రత్యేక ఆకర్షణగా నాదాల కార్యక్రమం..

ఊటుకూరులో మహిమాన్విత బాలా చౌడేశ్వరీ అమ్మవారి ఆశీర్వాదంతో సాంప్రదాయబద్ధంగా, అనాదిగా వస్తున్న నాదాల (దబ్బలాలు) గుచ్చే కార్యక్రమం యథావిధిగా జరిగింది. కోరిన కోర్కెలు నెరవేర్చాలంటూ భక్తులు నాదాలను పొడిపించుకున్నారు.